ముస్తాబవుతున్న గణనాథులు

- ఉత్సవ నిర్వాహకుల నుంచి ఆర్డర్ల వెల్లువ
- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల తయారీపై ఆసక్తి
- పర్యావరణహిత రంగుల వినియోగం



గణనాథుడి విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న కార్మికుడు

పాలకొల్లు సెంట్రల్: భక్తులతో తొలి పూజలు అందుకుని విఘ్నాలను తొలగించే అధినాయకుడు మహాగణపతి నవరాత్రుల ఉత్సవాలు మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్నాయి. ఈ నెల 19న భాద్రపద శుద్ధ చవితి నాడు ప్రారంభమై తొమ్మిది రోజులపాటు భక్తులతో పూజలందుకోవడానికి గణనాథులు ముస్తాబవుతున్నారు. గణపతి ఉత్సవాల సమయం దగ్గరపడుతుండడంతో విగ్రహాల తయారీదారులు విగ్రహాలకు వేగంగా తుది మెరుగులు దిద్దుతున్నారు. గతంలో గణపతి విగ్రహాలు తయారీ పూర్తిగా మట్టితో తయారు చేసేవారు. ఉత్సవ నిర్వాహకులు నేడు భారీ విగ్రహాల పోటీ పడుతుండడంతో తయారీదారులు సైతం మట్టి విగ్రహాల తయారీకి స్వస్తి పలికి ప్లాస్టర్‌ఆఫ్ ప్యారిస్ విగ్రహాల తయారీకే ప్రాధాన్యతనిస్తున్నారు. ఇవి పర్యావరణానికి చేటు కలిగించేవైనా తప్పడంలేదని తయారీదారులు చెపుతున్నారు. గతంలో ప్రధాన సెంటర్లలో గణపతి విగ్రహాలు ఏర్పాటు చేసేవారు నేడు యువత ఉత్సవాలపై ఎక్కువ ఉత్సాహం చూపిస్తుండడంతో ప్రతి సెంటర్లలో విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. దీనితో డిమాండ్ పెరిగి త్వరగా పూర్తయ్యే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలకే ప్రాధాన్యతనిస్తున్నారు. మట్టి విగ్రహాలు తయారీకి ముందుగానే ఆర్డర్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఏటా పాలకొల్లులో సుమారు 300 నుండి 500 విగ్రహాల వరకూ విక్రయిస్తుంటారు. 2 నుంచి 15 అడుగుల వరకూ విగ్రహాలు తయారు చేస్తున్నారు. వీటి ధర రూ. 3,200 నుంచి రూ.40వేలు వరకూ ఉంటుంది. పాలకొల్లు పట్టణం, చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా నరసాపురం, మొగల్తూరు, తూర్పుగోదావరి జిల్లా రాజోలు, మల్కిపురం ఇలా పక్క జిల్లాల నుంచి వచ్చి ఇక్కడ విగ్రహాలకు ఆర్డర్లు ఇస్తుంటారు.

పర్యావరణానికి హాని కలగని రంగులు



36 ఏళ్ల నుంచి విగ్రహాల తయారీ వృత్తిలోనే కొనసాగుతున్నాం. మట్టి విగ్రహాలు చేద్దామన్నా ఖర్చుతో కూడుకున్న పని, సమయం కూడా సరిపోవడం లేదు. ముందుగా చేస్తే మట్టి విగ్రహాలు పగుళ్లు వచ్చి పాడైపోతున్నాయి. ఎక్కువ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలనే తయారు చేస్తున్నాం. సుమారు 20 మంది కార్మికులు పని చేస్తుంటారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, పీచు, కర్రలతో విగ్రహాలను తయారు చేస్తాం. పర్యావరణానికి హాని కలగని రంగులు వాడుతున్నాం.

– ఇంటి ప్రసాద్, శిల్పి, పాలకొల్లు

నిబంధనలు పాటించాలి




గణపతి ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. మూడు అడుగులు మించకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి మండపం వద్ద డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలి. 1902, 100 ఎమర్జెన్సీ నంబర్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు మండపాల్లో ఏర్పాటు చేయాలి. తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలి. ఉత్సవ ఏర్పాట్లలో విద్యుత్ తీగలు, పరికరాలు ఉన్న ప్రదేశంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. సెప్టెంబర్ 15లోపు మునిసిపల్ కార్యాలయంలో ఉత్సవాల ఏర్పాట్లకు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. లేదంటే పండుగ నాడు ఒక్కరోజు మాత్రమే ఉత్సవ ఏర్పాటుకు అనుమతి ఇస్తాం.

– బీఆర్ఎస్ శేషాద్రి, మునిసిపల్ కమిషనర్, పాలకొల్లు



శ్రీరామ గణపతి



అర్ధనారీశ్వర గణపతి

క్లుప్తంగా

అర్హులందరికీ పథకాలు



కాళీపట్నంలో పింఛన్లు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మొగల్తూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని కాళీపట్నం సొసైటీ చైర్మన్ దొంగ నాగముని తెలిపారు. కాళీపట్నం పడమర గ్రామంలో 11 మందికి నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు సోమవారం అందించారు. ఇప్పటికే గ్రామంలో 603 మందికి పింఛన్లు అందిస్తున్నామని, ఇంకా అర్హులుంటే పథకాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నాయకులు కవురు ఆదినారాయణ, జక్కంశెట్టి ఏడుకొండలు, పూతినేని నాగసత్యనారాయణ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్ల అందజేత

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలూ ముఖ్యమేనని స్పోర్ట్స్ కిట్స్ ఇన్‌చార్జ్ వి ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలో జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో 75 ప్రాథమిక పాఠశాలకు, 4 అప్పర్ ప్రైమరీ పాఠశాలలకు, 14 ఉన్నత పాఠశాలలు, రెండు జూనియర్ కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ కిట్లను అందజేశామన్నారు. ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నమట్ల చిన్నయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీతత్వంతో చదవాలి



మురళీకృష్ణను అభినందిస్తున్న స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యం

నరసాపురం రూరల్: విద్యార్థులు పోటీతత్వంతో చదివి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కాకినాడ జేఎన్‌టీయూకి చెందిన ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ ఇంట్రాక్షన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. సోమవారం నరసాపురం మండలం సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ అటానమస్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల తరగతుల ప్రారంభం సందర్భంగా ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణతోపాటు స్వర్ణాంధ్ర ట్రెజరర్ త్రినాథ్, డైరెక్టర్ అద్దాల శ్రీహరి మాట్లాడుతూ నాలుగేళ్ల బీటెక్ కోర్సు పూర్తయ్యేలోపు సబ్జెక్టుపై పట్టుసాధించి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలన్నారు. ఆడిటర్ రాంబాబు, ప్రిన్సిపాల్స్ సురేష్‌కుమార్, పండరీనాథ్, హెచ్‌వోడీ స్వామినాథన్ వివిధ విభాగాల ప్రధాన అధ్యాపకులు కొంతమంది సీనియర్ విద్యార్థులు మాట్లాడారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో స్వర్ణాంధ్ర కళాశాల ఆవరణలో సందడి నెలకొంది.

నడిపూడిలో రహదారి నిర్మాణం

పెనుగొండ: నడిపూడి కట్టావారిపాలెం రహదారిని రూ.25లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు. దశాబ్ద కాలంగా రహదారి లేక కట్టావారిపాలెం ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఇటీవల గడపగడపకూ మన ప్రభుత్వంలో స్థానికులు మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లడంతో ఆయన రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. సర్పంచ్ కడలి బేబీ అన్నపూర్ణ, సొసైటీ అధ్యక్షుడు కె. గణపతి, ఉప సర్పంచ్ పూరిళ్ల శ్రీనివాస్, కడలి శ్రీను పర్యవేక్షించారు.

విద్యతోనే అభివృద్ధి

యలమంచిలి: విద్య ద్వారా కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయని పాలకొల్లు మన్యం జగమ్మ సత్రం చైర్మన్ నంబూరి శ్రీ గంగా పవన్‌కుమార్ అన్నారు. కొంతేరు, మేడపాడులోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సోమవారం ఆయన నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మేడపాడు ఎంపీటీసీ దేగల సూర్యప్రభ వెంకటేశ్వరరావు, ట్రస్ట్ బోర్డు సభ్యురాలు కడలి రామలక్ష్మి పాల్గొన్నారు.

నాలుగేళ్లు కష్టపడితే నలభై ఏళ్ల జీవితం



వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న పాలకవర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు

తాడేపల్లిగూడెం: నాలుగేళ్లు కష్టపడితే నలభై ఏళ్ల సుఖవంతమైన జీవితం వస్తుందని వాసవీ ఇంజనీరింగ్ కళాశాల ఇంజనీరింగ్ తొలి ఏడాది తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో వక్తలు తెలిపారు. పెదతాడేపల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో సోమవారం అతిథులు మాట్లాడుతూ 22 ఏళ్ల క్రితం 180 మంది విద్యార్థులతో ప్రారంభించిన ఈ కళాశాల నేడు రాష్ట్రంలో పేరెన్నికగన్న కళాశాలగా ఎదిగిందని అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు అన్నారు. అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ఆధునిక కోర్సులను విద్యార్థులకు అందించడంతోనే ఈ కళాశాల అటానమస్‌కు చేరిందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాలకవర్గ కోశాధికారి బాలకాశయ్య, సంయుక్త కార్యదర్శి పాటిబోలు వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు, టెక్నికల్ డైరెక్టర్ చెక్కా అప్పారావు పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమావేశం

మొగల్తూరు: మండల వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వేంకటేశ్వర కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తామని మండల యూత్ అధ్యక్షుడు ఏగి రాజశేఖర్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు హాజరుకానున్నారని, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీలు, పార్టీలోని వివిధ విభాగాల అధ్యక్షులు హాజరుకావాలని ఆయన కోరారు.

కాలేయ మార్పిడి శస్త్రచికిత్సకు సీఎం సహాయ నిధి



సీఎం సహాయ నిధి నుంచి రూ.10లక్షల మంజూరు పత్రాలను రోగి వెంకట సురేష్ కుటుంబ సభ్యులకు అందజేస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: పేద రోగులను ఆదుకోవడం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి కోట్లాది రూపాయలు మంజూరు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. యాళ్లవానిగరువు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స నిమిత్తం పట్టణానికి చెందిన గంధం వెంకట సురేష్‌కి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.10లక్షల ఉత్తర్వు కాపీలను రోగి కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. సురేష్ వైజాగ్‌లోని ఓ ప్రయివేటు కంపెనీలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తుంటారు. అతనికి కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స చేయించాల్సి ఉంది. దీంతో గుడాల గోపిని బాధితుడు సురేష్ తల్లి భూలక్ష్మి, సోదరుడు సాయిరామ్ కుమార్ సంప్రదించారు. దీనిపై గోపి స్పందించి సీఎంవో కార్యాలయాన్ని సంప్రదించడంతో సురేష్ శస్త్ర చికిత్సకు అవసరమైన రూ.10లక్షలు మంజూరయ్యాయి. హైదరాబాద్ గ్లోబల్ హాస్పిటల్లో ఈ వారంలో శస్త్ర చికిత్స చేయనున్నట్లు సాయిరామ్‌కుమార్ తెలిపారు. తన కాలేయంలో కొంత భాగం దానం చేస్తున్నట్లు సాయిరామ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

యలమంచిలి: ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నింటినీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. కొంతేరులో నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు సోమవారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు యడ్ల తాతాజీ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షురాలు జక్కంశెట్టి భాగ్యలక్ష్మి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ జక్కంశెట్టి సుభాష్ చంద్రబోస్, నాయకులు పోలుకొండ వెంకటేశ్వరరావు, జోగి రాజేష్ పోలుకొండ ఏలియా భక్తసింగ్, కొయ్యే నాగేశ్వరరావు, నిమ్మకాయల రామకృష్ణ, కుక్కల రామకృష్ణ, పెచ్చెట్టి కృష్ణాజీ, కేతా వెంకన్న, నిమ్మకాయల వెంకట్, జవదాల సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలి

పెనుమంట్ర: నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాలని కోరుతూ సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సీపీఎం సమరభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుమంట్ర తహసీల్దార్ కార్యాలయం వద్ద కొద్దిసేపు ధర్నా నిర్వహించిన అనంతరం తహసీల్దార్ దండు అశోక్‌వర్మకు వినతిపత్రం అందజేసారు. సీపీఎం జిల్లా సీనియర్ నేత ఆకుల హరేరాం, సీపీఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు, సభ్యులు బత్తుల విజయ్‌కుమార్, ఎం సత్యనారాయణ, ఐ వెంకటరాజు పాల్గొన్నారు.

నిరుద్యోగాన్ని పెంచుతున్న కేంద్రం

పెనుగొండ: కేంద్రంలో మోదీ ప్రభుత్వం మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందని సీపీఎం పెనుగొండ మండల కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు విమర్శించారు. సీపీఎం పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ప్రజా సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దారు ఎన్ గురుమూర్తి రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మండల కమిటీ సభ్యుడు షేక్ పాదుషా, గ్రామ కమిటీ కార్యదర్శి గుర్రాల సత్యనారాయణ, మాదాసు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల కళ్లలో ఆనందమే లక్ష్యంగా పాలన



కొడమంచిలిలో పింఛన్లు అందిస్తున్న సీతారామ్

పెనుగొండ: ప్రతి పేదవాడి కళ్లలో ఆనందమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ తెలిపారు. కొడమంచిలి పంచాయతీ పరిధిలో నూతనంగా మంజూరైన 23 పింఛన్లను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ యల్లమెల్లి బేబీ రాజేష్, ఏఎంసీ డైరక్టరు జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, రైతు సంఘ అధ్యక్షుడు మన్నే సుబ్బారావు, సచివాలయ మండల కన్వీనరు టీఎస్‌డీ చంద్రశేఖర్, దేవస్థానం చైర్మన్ బాలనాగు నరేష్, వైఎస్సార్ సీపీ నాయకులు కాజా మహేష్, చిలుకూరి వీరేంద్ర, బొక్కా రామకృష్ణ, వెల్‌ఫేర్ అసిస్టెంట్‌లు డానియేలు, భవానీ వలంటీర్లు పాల్గొన్నారు.

దగ్గులూరు ఉపసర్పంచ్‌గా పేరయ్య ఎన్నిక



దగ్గులూరు ఉపసర్పంచ్‌గా విశ్వనాథం పేరయ్యకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరు ఉపసర్పంచ్‌గా విశ్వనాథం పేరయ్య సోమవారం ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు ఉపసర్పంచ్‌గా పనిచేసిన విశ్వనాథం రామలింగం ఆకస్మికంగా మరణించడంతో ఈ ఎన్నిక నిర్వహించారు. దగ్గులూరు గ్రామ సచివాలయం పంచాయతీ బోర్డు సమావేశం నిర్వహించారు. పేరయ్యను ఉపసర్పంచ్‌గా 10వ వార్డు మెంబర్ కాసా బసవ కుమార్ ప్రతిపాదించగా 9వ వార్డు మెంబర్ కలిదిండి రామచంద్రరాజు బలపరచారు. పేరయ్యను సర్పంచ్ విశ్వనాథం కనకభద్రం, పంచాయతీ కార్యదర్శి ఐ మల్లేశ్వరరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ మాధురి, మాజీ సర్పంచ్ సప్పరపు కోటేశ్వరరావు, పొన్నా వీరబసవయ్య, పార్టీ నాయకులు రుద్రరాజు రామచంద్రరావు, రావి సర్వేశ్వరరావు, శలా విశ్వనాథం, కొడమంచిలి గోవింద్, సప్పరపు ప్రసాద్, శలా రాంబాబు, మల్లికార్జునరావు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

వైఎస్సార్ కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తాం



గుడాల గోపికి వినతిపత్రం అందజేస్తున్న 27వ వార్డు వైఎస్సార్ కాలనీ వాసులు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని 27వ వార్డులో వైఎస్సార్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరుకు తన వంతు కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. లజపతిరాయపేట కేవీఎం ఛాంబర్స్ జూనియర్ కళాశాలను ఆనుకుని ఉన్న వైఎస్సార్ కాలనీ వాసులు సోమవారం గుడాల గోపిని కలిసి వినతిప్రతం అందజేశారు. వార్డు ఇన్‌చార్జ్ ఉప్పె పండుబాబు, వార్డు నాయకులు నంది బాబి, జుత్తిగ నరసింహారావు పాల్గొన్నారు.

స్పందనకు 29 అర్జీలు

నరసాపురం రూరల్: నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్య క్రమంలో వివిధ సమ స్యలపై 29 అర్జీలు అందాయని కార్యాలయ ఏవో యేడిద శ్రీనివాస్ తెలిపారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ వీడియోకాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన స్పందనలో డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజల నుంచి వచ్చి సమస్యలపై అర్జీలను ఏవోకు అందజేశారు. మత్స్యకారులకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన సి క్లాస్ పట్టాలను డి నమూనా పట్టాలుగా మార్పుచేసి వారికి హక్కు కల్పించాలని కోరుతూ సంఘ నాయకుడు అండ్రాజు చల్లారావు వినతిపత్రం అందజేశారు.

క్రీడలను ప్రోత్సహించాలి

యలమంచిలి: చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహించాలని యలమంచిలి తాళ్లూరి నారాయణస్వామి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం చింతా చిట్టిబాబు అన్నారు. స్థానిక హైస్కూల్ ప్రాంగణంలో సోమవారం మండలస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. అండర్-14, అండర్-17 స్థాయిలో బాల, బాలికలకు కోకో, కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను పాలకొల్లు నియోజకవర్గ కోఆర్డినేటర్ రేలంగి రామకృష్ణ, యలమంచిలి మండల కోఆర్డినేటర్ యాండ్ర సత్యనారాయణల ఆధ్వర్యంలో వ్యాయామోపాధ్యాయులు గుబ్బల మల్లిఖార్జునుడు, కిరణ్ పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుగొండ: పెనుగొండ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి సురేష్‌కుమార్ సోమవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. పెనుగొండ, వడలి, వెంకట్రామపురం, చిన్నంవారిపాలెం, మునమర్రు, కొఠాలపర్రు, దేవ, దేవ తాళ్లపాలెం, సోమరాజు చెరువుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

అవినీతి తిమింగలం చంద్రబాబు

- 18 కేసుల్లో స్టేలు తెచ్చుకున్న ఘనుడు
- సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



యాళ్లవానిగరువు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఉచ్చుల స్టాలిన్ తదితరులు

పాలకొల్లు అర్బన్: అవినీతి, అక్రమాలకు పాల్పడి 18 కేసుల్లో కోర్టుల నుంచి స్టేలు తెచుకున్న ఘనుడు చంద్రబాబు నాయుడని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉచ్చుల స్టాలిన్ విమర్శించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆదేశాల మేరకు యాళ్లవానిగరువు వైసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతిలో తాత్కాలిక భవనాల నిర్మాణం పేరుతో రూ.118 కోట్లు చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని దుయ్యబట్టారు. దీనిపై ఐటీ చంద్రబాబుకి నోటీసులు జారీ చేయడంతో టీడీపీ నేతలు పెదవి విప్పడం లేదన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు రాష్ట్ర సంపదను దోచేశారని విమర్శించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ తన తండ్రి చంద్రబాబు మింగేసిన రూ.118 కోట్లకి సమాధానం చెప్పాలని స్టాలిన్ డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తే వైసీపీ నాయకులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. మరోసారి జగన్‌ను సీఎం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీను, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, పార్టీ నాయకులు బండి రమేష్, జమ్ము కాశి, బొంతు వెంకట కర్ణారెడ్డి, వీరా ఉమాశంకర్, కల్యాణం గంగాధరరావు, నిమ్మకాయల రామకృష్ణ లోపింటి చిరంజీవి, లంక చిరంజీవి, మోర్త గిరీష్, కుక్కల బాలచంద్రన్, బాకూరి సత్య నిరంజన్, గేదెల నరసింహారావు, బొక్కా సురేష్, మంద హరికుమార్, జవదాల సువర్ణరాజు, పోలుకొండ ఏలియాభక్తసింగ్, పోలుకొండ వెంకట్, చుట్టుగుళ్ల అప్పారావు, పెచ్చెట్టి ఏడుకొండలు, శిర్రా నాగరాజు పాల్గొన్నారు.

శేరేపాలెం ఉప సర్పంచ్‌గా నాగరాజు



నాగరాజుకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఎన్నికల అధికారి

మొగల్తూరు: మండలంలోని శేరేపాలెం ఉప సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ బలపర్చిన 3వ వార్డు సభ్యుడు చుండూరి నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన ఎన్నికలలో యలమంచిలి ఈవోపీఆర్డీ షేక్ అమీర్ షరీఫ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. పది మంది వార్డు సభ్యుల్లో ఒకరు హాజరుకాకపోవడంతో వైఎస్సార్ సీపీ బలపర్చిన మిగిలిన ఎనిమది మంది సభ్యులు నాగరాజును ఎన్నుకోవడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి షేక్ అమీర్ షరీఫ్ ప్రకటించి ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తణుకుల మునేశ్వరరావు, కార్యదర్శి జయరాజు, పార్టీ నాయకులు రంగిశెట్టి ఏసు, కొత్తపల్లి బాబి, ఏగి బాబి, తన్నీడి గిరి పాల్గొన్నారు.